సాక్షి
ప్రకాశం
బుధవారం, 17, మే, 2023



పేదల సొంతింటి కల సాకారం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. - 8లో..



దామచర్ల వ్యాఖ్యలపై భగ్గుమన్న బీసీ సంఘాలు

ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల వ్యాఖ్యలపై బీసీ కుల సంఘాలు మండిపడ్డాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
46.47/30

వాతావరణం

ఆకాశం పొడిగా ఉంటుంది. వడగాడ్పులు వీస్తాయి. ఉక్కపోత అధికం. ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నవోదయలో 11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయ విద్యాసంస్థలో 2023–24 విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్+మ్యాథ్స్, గణితం లేకుండా కేవలం సైన్స్‌తో కూడిన గ్రూపులలో ఖాళీలు ఉన్నాయన్నారు. ఒంగోలు, చీరాల, కందుకూరు, అద్దంకి, వేటపాలెం, గుడ్లూరు, వలేటివారిపాలెం, పొన్నలూరు, లింగసముద్రం, సింగరాయకొండ, ఉలవపాడు, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, సంతమాగులూరు, కొరిశపాడు, జె.పంగులూరు, మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాల విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. వీరంతా తప్పనిసరిగా 2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థ నుంచి పదో తరగతి ఉత్తీర్ణత చెంది ఉండాలన్నారు. నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని పదో తరగతి అభ్యసించిన పాఠశాల హెచ్‌ఎంచే దరఖాస్తును ధ్రువీకరింపజేసి ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి జూలై 22న పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

జగనన్న విద్యా కానుక సిద్ధం

- డీఈవో రమేష్




పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో రమేష్

సింగరాయకొండ: ప్రభుత్వ పాఠశాలలు తెరిచే నాటికి అన్ని పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లు సిద్ధంగా ఉండేలా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని డీఈవో పి.రమేష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా కానుక కిట్లను విడతలవారీగా అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం విద్యార్థులకు నూతన యూనిఫాం ఇస్తున్నామన్నారు. యూనిఫాం రంగులు కూడా మారాయన్నారు. జిల్లాలో పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కానీ, విద్యార్థుల శాతం తక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల తెరిచే నాటికి నాడు–నేడు పథకం కింద పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానంగా బాత్‌రూమ్‌లు, తరగతి గదులు సిద్ధంగా ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాల రికార్డులు, నాడు–నేడు పనులు, విద్యా కానుక కింద సరఫరా అయిన పాఠ్యపుస్తకాలను ఆయన పరిశీలించారు. ఈ సంవత్సరం నూతనంగా ఇస్తున్న యూనిఫాం, బ్యాగులు, షూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో బి.శివన్నారాయణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం హరేరామ్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లమలలో జలం పుష్కలం

జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఐదు రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నల్లమల అటవీ ప్రాంతంలో కూడా భానుడి తీవ్రతకు చెట్ల ఆకులన్నీ రాలిపోవడంతో వన్యప్రాణులు అల్లాడుతున్నాయి. వాటికి ఆహార కొరతతో పాటు దాహం తీర్చి సంరక్షించేందుకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. సహజ నీటి వనరులు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాసర్‌పిట్లలో నీటిని అందుబాటులో ఉంచుతోంది. వన్యప్రాణులు అడవి దాటి బయటకు రాకుండా చూస్తోంది.



నల్లమలలో నీరు తాగుతున్న చిరుత

- మండు వేసవిలో వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- నీటి కోసం 151 సాసర్‌పిట్లు ఏర్పాటు
- సహజసిద్ధంగా 275 నుంచి 300 నీటి కుంటలు
- ట్రాక్టర్ల ద్వారా నీటి సరఫరా
- పచ్చగడ్డి పెరిగేందుకు సోలార్ స్ప్రింక్లర్ల ఏర్పాటు
- అటవీ శాఖాధికారుల నిరంతర పర్యవేక్షణ

మార్కాపురం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, ప్రకాశం, గుంటూరు, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో నాగార్జునసాగర్–శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యంలో వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఈ ఐదు జిల్లాల పరిధిలో 5,938 చదరపు కిలోమీటర్లు విస్తరించిన ఎన్ఎస్‌టీఆర్‌లో 3,568.09 చ.కి.మీ. కోర్ ఏరియా, 1175.51 చ.కి.మీ. బఫర్ ఏరియాతో పాటు ఎన్ఎస్‌టీఆర్‌లో అంతర్భాగమైన గుండ్ల బ్రహ్మేశ్వరం అభయారణ్యం 1,194 చ.కి.మీ. విస్తరించి ఉంది. మండుటెండల నేపథ్యంలో ప్రస్తుతం ఎన్ఎస్‌టీఆర్‌లోని వన్యప్రాణులకు రక్షణ కల్పించేందుకు అటవీశాఖ ప్రత్యేక కసరత్తులు చేసింది.

నిరంతరం పర్యవేక్షణ...

వన్యప్రాణులు, పులులు అటవీ ప్రాంతం నుంచి బయటకు రాకుండా అన్ని చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ద్వారా వాటి కదలికలను పరిశీలిస్తున్నారు. ప్రతి రోజు వాకీటాకీ ద్వారా మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్‌కు సమాచారం అందిస్తారు. ఉన్నతస్థాయిలో సెక్షన్ ఆఫీసర్, ఆపైన డీఎఫ్‌వోలు ప్రతిరోజూ అడవిలో ఏం జరుగుతుంది, జంతువుల కదలికలపై సమాచారం సేకరిస్తారు. గంజివారిపల్లె సమీపంలోని పెద్దన్న బేస్ క్యాంప్‌తో పాటు నారుతడికల, పాలుట్ల, ఇష్టకామేశ్వరీ, దొరబైలు, కొలుకుల, తుమ్మలబైలు, వెదురుపడియ, చినమంతనాల, రోళ్లపెంట, కొర్రపోలు, తదితర ప్రాంతాల్లో బేస్ క్యాంప్‌లు ఉన్నాయి. వాటిలో ఐదుగురు అటవీ అధికారులు ఉంటారు. అడవిలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు కొర్రపోలు, శిరిగిరిపాడు, దోర్నాల గణపతి గుడి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మొత్తం మీద 120 మంది ప్రొటెక్షన్ వాచర్లు పులుల సంరక్షణలో ఉన్నారు.

రాత్రి 9 గంటల నుంచి రాకపోకలు బంద్...

రాత్రివేళ శ్రీశైలం వెళ్లే ప్రయాణికులను దోర్నాల చెక్ పోస్టు వద్ద రాత్రి 9 గంటలకే నిలిపివేస్తున్నారు. తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చే వాహనాలను కూడా ఈగలపెంట వద్ద అక్కడి చెక్‌పోస్టు సిబ్బంది 9 గంటలకు నిలిపివేస్తున్నారు. రాత్రిపూట పెద్దపులులు, చిరుతపులులు, జింకలు, రేసుకుక్కలు, తదితర అటవీ జంతువులు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంది. రాత్రి సమయంలో అడవి జంతువులు వచ్చి దాహం తీర్చుకుంటాయి. నల్లమల అటవీ ప్రాంతంలో సహజ కుంటల్లో వేసవిలో కూడా నీరు ఉండటం విశేషం. దీంతో అడవి జంతువులు ఇక్కడికి వచ్చి సేద తీరుతుంటాయి.

పెరిగిన పులుల సంఖ్య...

మార్కాపురం డీఎఫ్‌ఓ పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, గంజివారిపల్లె, గుంటూరు జిల్లాలోని విజయపురిసౌత్ రేంజ్‌లు ఉండగా, గిద్దలూరు పరిధిలో గిద్దలూరు, గుండ్లకమ్మ, తురిమెళ్ల, కనిగిరి, ఒంగోలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం 62 పెద్ద పులులు ఉండగా, వాటి సంఖ్య ఇప్పుడు 73కు పెరిగింది. ప్రస్తుతం పులుల గణన జరుగుతోంది. స్మగ్లింగ్‌ను నిరోధించటం, అటవీలో వెదురు బొంగుల కటింగ్ నిలిపివేయడంతో పులుల సంఖ్య పెరిగినట్లు అటవీశాఖాధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం నల్లమల అటవీ ప్రాంతంలో మొత్తం 24 బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి ఒక్కొక్క బేస్ క్యాంప్‌లో ఐదుగురు చెంచులను ప్రొటెక్షన్ వాచర్లుగా అటవీ అధికారులు నియమించారు. వీరు నిరంతరం అడవిలో తిరుగుతూ పులుల సంరక్షణపై దృష్టి పెడతారు. పులుల కదలికలను ట్రాక్ చేస్తారు.

ప్రత్యేక రక్షణ చర్యలు



నల్లమల అటవీ ప్రాంతంలో పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో వన్యప్రాణులు నీటి కోసం జనవాసాలలోకి రాకుండా ఉండేందుకు 151 సాసర్‌పిట్లు ఏర్పాటు చేసి నీరందిస్తున్నాం. వన్యప్రాణుల సంరక్షణకు కూడా పలు రకాల చర్యలు తీసుకున్నాం. జంతువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది. ఎత్తైన, అరుదైన వృక్షాలు, జంతువులు నల్లమలలో ఉన్నాయి. వేసవిలో జంతువులకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసకున్నాం. ఘాట్ రోడ్డులో ఎవరైనా వాహనాలు ఆపి బీడీ, సిగరెట్ తాగితే వెయ్యి రూపాయల జరిమానా విధిస్తున్నాం.

– విఘ్నేష్ అప్పావు, డీడీ, మార్కాపురం



నీరు తాగుతున్న వివిధ రకాల పక్షులు



ట్యాంకర్ ద్వారా నీరు నింపుతున్న సిబ్బంది

నీటి వనరులపై ప్రత్యేక దృష్టి...

వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో వణ్యప్రాణులు తాగునీటి కోసం దోర్నాల – శ్రీశైలం, దోర్నాల – ఆత్మకూరు రహదారిపైకి, గ్రామాల్లోకి రాకుండా ఉండేందుకు అటవీ ప్రాంతంలో 151 సాసర్‌పిట్లు ఏర్పాటు చేశారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి ట్యాంకర్ల ద్వారా వాటిని నింపుతున్నారు. వీటితో పాటు సహజసిద్ధంగా 275 నుంచి 300 నీటి కుంటలు ఉన్నాయి. వాటిలోనూ నీరు అందుబాటులో ఉండేలా అధికారులు దృష్టి సారించారు. దీంతో పెద్ద పులులు, చిరుతలు, దుప్పులు, ఇతర వన్యప్రాణులు అక్కడికి వచ్చి నీళ్ల తాగుతున్నాయి.

దీనివలన రోడ్లపైకి వచ్చి ప్రమాదాలకు గురికాకుండా ఉంటున్నాయి. అడవిలో పచ్చిక పెరిగేందుకు సోలార్ ద్వారా స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసి నీటిని అందిస్తున్నారు. దీంతో వన్యప్రాణులకు పుష్కలంగా ఆహారం దొరుకుతోంది.



ఒంగోలులో ఎండ తీవ్రతకు జనసంచారం లేని కొత్తపట్నం బస్టాండ్ సెంటర్

వామ్మో 46.47

- నిప్పులు చిమ్ముతున్న భానుడు
- జిల్లాలో 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- తీవ్రంగా పెరిగిన ఎండ, వేడిగాలులు
- ఉదయం 7 గంటల నుంచే సెగలు
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

ఒంగోలు అర్బన్: మూడు రోజులుగా భానుడు నిప్పులు కురిపిస్తుండటంతో జిల్లావాసులు అల్లాడిపోతున్నారు. రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండలు మండిపోవడంతో పాటు ఉక్కపోత కూడా పెరిగిపోయింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు, వేడిగాలులు పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉదయం 8 గంటలకే ఎండ వేడిమి తాళలేక ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని ప్రధాన వీధులన్నీ నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూను తలపిస్తున్నాయి. జిల్లాలో అత్యల్పంగా 30 డిగ్రీలు, అత్యధికంగా 46.47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యల్ప ఉష్ణోగ్రతలు పెరగడంతో వాతావరణంలో సెగ ఎక్కువగా ఉండటంతో ఉక్కపోతలు పెరిగాయి. అత్యవసర పనులకు సైతం ఎండ సమయంలో బయట తిరగాలంటే ప్రజలు జంకుతున్నారు.

జిల్లా కేంద్రమైన ఒంగోలులో గడిచిన మూడు రోజులుగా 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం ఒంగోలులో 44 డిగ్రీలు నమోదైంది. జిల్లాలో అత్యధికంగా కురిచేడులో 46.47 డిగ్రీలు నమోదవగా, మద్దిపాడు మండలం గుండ్లాపల్లిలో 46.22, కనిగిరిలో 46, మద్దిపూడి మండలం జువ్వికుంటలో 45.9, కొనకనమిట్లలో 46.39, జరుగుమల్లిలో 45.79, యర్రగొండపాలెంలో 45, మార్కాపురంలో 44, దర్శిలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో నాలుగైదు రోజుల పాటు ఉష్ణోగ్రతలతో పాటు వడగాడ్పులు పెరుగుతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. కూలీలు, కార్మికులు కూడా ఎండ సమయంలో పనులకు వెళ్లకూడదని సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల పట్ల మరింత జాగ్రత్తలు వహించాలంటున్నారు. పెరిగిన ఎండలు, వేడిగాలుల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావడం మంచిది కాదని డాక్టర్లు, అధికార యంత్రాంగం హెచ్చరిస్తోంది. ఉదయం 11 గంటల్లోపు పనులు చూసుకుని ఎండ తీవ్రత తగ్గిన తర్వాత సాయంత్రం 4 గంటల సమయంలో మాత్రమే బయటకు రావాలని సూచిస్తున్నారు. ఒకవేళ అవసరం రీత్యా బయటకు వచ్చినా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. డీహైడ్రేషన్, వడ దెబ్బ తగలకుండా తాగునీరు, కొబ్బరినీళ్లు, గ్లూకోజ్, ఓఆర్ఎస్, మజ్జిగ, పండ్ల రసాలు వంటివి ఎక్కువగా తీసుకుంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఎండ తీవ్రతకు తల తిరిగినా, నోరు పాడిబారిపోయినా, వడదెబ్బ తగిలినట్లు అనుమానం వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచిస్తున్నారు.

కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలి

- కార్మికశాఖ ఒంగోలు సహాయ కమిషనర్ అనితవాణి



కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కార్మికశాఖ అధికారులు

ఒంగోలు: ఎండలు, వడగాడ్పుల తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలని కార్మికశాఖ ఒంగోలు సహాయ కమిషనర్ బి.అనితవాణి సూచించారు. కార్మికశాఖ ఉప కమిషనర్ ఎస్.శ్రీనివాసకుమార్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్లు, భవన నిర్మాణాల పనులు చేస్తున్న కార్మికులు, ఇటుక బట్టీల కార్మికులను కలిసి జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. ప్రతి కార్మికుడు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పనులు చేయవద్దని స్పష్టం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో పని చేయాల్సి వస్తే తలకు హెల్మెట్, టవల్, టోపీ వంటివి ధరించాలని సూచించారు.

పని ప్రదేశంలో తప్పనిసరిగా మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులను కార్మికులకు అందుబాటులో ఉంచాలని యజమానులను ఆదేశించారు. అనంతరం పేర్నమిట్టలోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్, కరవది, జరుగుమల్లి, సింగరాయకొండలోని ఇటుకబట్టీలు, ఇతర నిర్మాణంలో ఉన్న కట్టడాలను సందర్శించి కార్మికులకు సూచనలు చేశారు. కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

కుంటపోరంబోకు నివాసితులను ఆదుకుంటాం

- సాంకేతిక సమస్యలు తొలగిస్తాం
- ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం
- కలెక్టర్ దినేష్‌కుమార్‌తో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



చాకలికుంట నివాసితుల సమస్యలపై కలెక్టర్ దినేష్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: నగరంలో ఏళ్ల తరబడి కుంటపోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్న వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌తో కలిసి నగరంలోని చాకలికుంట, దారావారికుంట, ఊరచెరువు ప్రాంతాలను మంగళవారం బాలినేని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సంవత్సరాల తరబడి నివాసం ఉంటున్న వారి స్థితిగతులపై నిర్వహించిన ఈ పర్యటనలో బాలినేని మాట్లాడుతూ చాకలికుంట, దారావారికుంట ప్రాంతాల్లో 25 సంవత్సరాలకుపైగా ప్రజలు నివాసం ఉంటున్నారన్నారు. దారావారికుంటలో 150 మందికిపైగా పారిశుధ్య కార్మికులు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారన్నారు. కుంటల స్థలాలకు సంబంధించి సాంకేతికపరమైన సమస్యలు ఉండటంతో నివాసం ఉండేవారికి పట్టాలివ్వడానికి వీలుపడటం లేదన్నారు. ఈ సమస్యను స్థానికులు తన దృష్టికి తరచూ తీసుకొస్తున్నారని, ఈ నేపథ్యంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కూడా తీసుకొచ్చి సమస్య పరిష్కారానికి పూనుకున్నామని బాలినేని తెలిపారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి స్థానికంగా నివాసం ఉండేవారిని కలెక్టర్ ఆదుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. పేద ప్రజలను ఆదుకునేందుకు శాయశక్తులా తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. అవసరమైతే ఈ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

న్యాయం జరిగేలా చూస్తాం : కలెక్టర్ దినేష్‌కుమార్

క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కుంట భూముల్లో ఉంటున్న వారికి న్యాయం జరిగేలా చూస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ హామీ ఇచ్చారు. రికార్డుల ప్రకారం ఆయా ప్రాంతాలను నీటి వనరులుగా పేర్కొన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అలాంటివేమీ లేవని నిర్ధారణ అయిందన్నారు. చాకలికుంట, దారావారికుంట ప్రాంతాల్లో కొన్నేళ్లుగా పేదలు తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నట్లు అధికారులు కూడా కలెక్టర్‌కు వివరించారు. రికార్డుల ప్రకారం రెగ్యులరైజ్ చేయడానికి సాంకేతిక సమస్యలు ఉన్నాయన్నారు. స్థానికంగా నివాసం ఉంటున్న వారికి మంచినీటి వసతి, హౌసింగ్, శానిటేషన్, మురుగు కాలువలు వంటి సౌకర్యాలు కల్పించేందుకు పూనుకుంటామన్నారు. కొత్త కూరగాయల మార్కెట్ ప్రాంగణంలోని ఊరచెరువు ప్రాంతాన్ని కూడా బాలినేని, కలెక్టర్ పరిశీలించారు. చేపల మార్కెట్‌కు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని గ్రీన్‌పార్కుగా అభివృద్ధి చేయాలని స్థానిక 24వ డివిజన్ కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ హరిబాబు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంలో సరైన పార్కు లేనందున ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీటికుంటల మాదిరిగా తయారు చేసి చుట్టూ కట్ట నిర్మాణం చేస్తే వాకింగ్ ట్రాక్‌గా కూడా వినియోగించుకోవచ్చని, అందుకు సంబంధించిన ప్రణాళికలు, అంచనాలు రూపొందించాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావును కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాదు, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఇన్‌చార్జ్ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఒంగోలు తహసీల్దార్ మురళి, కార్పొరేటర్లు ఎందేటి పద్మావతి రంగారావు, బేతంశెట్టి శైలజ హరిబాబు, చల్లా తిరుమలరావు, ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి శంకర్, గోలి తిరుపతిరావు, తమ్మినేని మాధవి, తూము పద్మ, శుద్దపల్లి శశిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండ

- వేట నిషేధ సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు
- జిల్లాలో 5,260 కుటుంబాలకు రూ.5.26 కోట్లు
- కలెక్టర్ దినేష్‌కుమార్



మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్యకార భరోసా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఒడా చైర్‌పర్సన్ మీనాకుమారి, తదితరులు

ఒంగోలు అర్బన్: మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటోందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకంలో భాగంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసే రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని బాపట్ల జిల్లా నిజాంపట్నంలో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించారు. ఆ కార్యక్రమానికి అనుబంధంగా ఒంగోలులోని ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సముద్రంలో మత్స్య సంపదను సంరక్షించడంలో భాగంగా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు యాంత్రిక, మర పడవలతో సముద్రంలో చేపల వేటపై నిషేధం విధించడం జరిగిందన్నారు. అందువలన ప్రభావితమయ్యే ప్రతి మత్స్యకారుడి కుటుంబానికి రూ.10 వేల చొప్పున జీవనభృతిని ప్రభుత్వం అందిస్తోందన్నారు. జిల్లాలో 5,260 కుటుంబాలకు రూ.5.26 కోట్ల జీవనభృతిని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో రూ.4 వేలు ఇచ్చేవారని, ప్రస్తుతం రూ.10 వేలకు పెంచడంతో పాటు యాంత్రిక, మర పడవలతో పాటు దేశీయ నాటు పడవలపై చేపల వేట చేసే మత్స్యకారులకు కూడా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ వివరించారు. జిల్లాలోని సంతనూతలపాడు నియోజకవర్గంలో 277 మందికి, ఒంగోలు నియోజకవర్గంలో 3,509 మందికి, కొండపి నియోజకవర్గంలో 1,474 మందికి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లుగా జిల్లాలోని అర్హులైన మత్స్యకారులకు రూ.46.88 కోట్ల జీవనభృతి అందించినట్లు తెలిపారు. వీటితో పాటు సీఎస్ఎస్, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, సాగర్‌మిత్ర, ఫిష్ ఆంధ్ర వంటి పథకాలు అమలుచేస్తూ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేసి మత్స్యకారులకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నట్లు వివరించారు. స్థానిక మత్స్యకారులకు నష్టం కలిగిస్తున్న తమిళనాడు మర పడవలను అడ్డుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కడలూరు కలెక్టర్‌తో కూడా ఈ విషయంపై మాట్లాడినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఓయూడీఏ చైర్మన్ సింగరాజు మీనాకుమారి, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ సుమతి, ఆప్కాఫ్ న్యాయసలహాదారు సైదా, మత్స్యకార సమితి జోనల్ నాయకుడు నాగార్జున, మత్స్యకార సంఘ నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు సాఫ్ట్‌బాల్ జిల్లా జూనియర్ జట్ల ఎంపిక

ఒంగోలు: సాఫ్ట్‌బాల్ బాలబాలికల జిల్లా స్థాయి జూనియర్ జట్లను ఈ నెల 18వ తేదీ స్థానిక మినీ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు ప్రకాశం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొడ్డు సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులన్నారు. ఎంపికైన జట్లు ఈ నెల 26, 27, 28 తేదీల్లో అన్నమయ్య జిల్లాలో జరిగే 10వ రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వారి ఆధార్‌కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 99493 46536, 93984,79248 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వడదెబ్బకు ఒకరు మృతి


ప్రసాదరావు(ఫైల్)

చీమకుర్తి: పేర్నమిట్టలోని శాంతినగర్‌కు చెందిన వంకాయలపాటి ప్రసాదరావు(65) వడదెబ్బకు కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం నాటి ఎండల తీవ్రతకు డీహైడ్రేషన్ ఎక్కువై ఇంటి వద్దనే మృతి చెందినట్లు మృతుడి భార్య జయమ్మ తెలిపింది. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం ద్వారా జయమ్మ విన్నవించుకుంది.

యువకుడు ఆత్మహత్య

మార్కాపురం: అప్పుల బాధ భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని రాయవరంలో జరిగింది. రూరల్ ఎస్సై సుమన్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ (26) అప్పుల బాధ భరించలేక సోమవారం పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి ఒంగోలుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల సొంతింటి కల సాకారం

● అదే సీఎం జగనన్న లక్ష్యం
● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెట్టుకున్నారని, అర్జీ ఇచ్చిన మూడు నెలల్లోపు స్థలం కేటాయించి ఇంటి నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. యర్రగొండపాలెం సచివాలయం -2 పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణం పేరుతో రుణాలిప్పిస్తామని, వాటిని విడతల వారీగా చెల్లించాలన్న నిబంధనలతో పేదలపై 20 ఏళ్ల పాటు రుణ భారం మోపాలని చూశారన్నారు. ఇంటి స్థలం కేటాయించాలంటే జన్మభూమి కమిటీలు సిఫార్సు చేయాలని, వారి వద్దకు వెళ్లి పడిగాపులు కాసినా టీడీపీ వారికి, వారి కులం వారికే స్థలాలు అందేవని గుర్తుచేశారు. జగనన్న పాలనలో అటువంటి పరిస్థితి లేదని, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. మోసపూరిత మాటలు చెప్పి తిరిగి అధికారంలోకి రావడానికి రాబందులు రాష్ట్రంపై వాలుతున్నాయని, ఒకవైపు నుంచి చంద్రబాబు, మరోవైపు నుంచి ఆయన తనయుడు లోకేష్, ఇంకోవైపు నుంచి బాబు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ రాష్ట్రాన్ని చుట్టుముట్టారని ఆయన అన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఎదుర్కోడానికి ప్రతిపక్షాలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఏంచేయలేని పరిస్థితుల్లో ఉన్నారని, జరగబోయే ఎన్నికల్లో తమ పార్టీ 175 సీట్లలోనూ పోటీ చేస్తుందని చెప్పే ధైర్యం ఏ ఒక్కరూ చేయడం లేదని మంత్రి అన్నారు. ప్రజా బలంతో జగనన్న ఒంటరిగానే పోటీచేస్తారని, రాష్ట్రంలో 175 సీట్లు తమ పార్టీకే దక్కుతాయని ధీమా వ్యక్తం చేశారు.

వైఎస్సార్ మత్స్యకార భరోసా చారిత్రక విజయం...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ మత్స్యకార భరోసా అందించడం చారిత్రక విజయమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. మంగళవారం బాపట్ల జిల్లా నిజాంపట్నంలో బటన్‌నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో రూ.231 కోట్లను సీఎం జమ చేయడం హర్షించదగిన విషయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో మత్స్యకారులు అనేక ఇబ్బందులు పడ్డారని, వేట నిషేధం భృతి కేవలం రూ.2 వేల నుంచి రూ.4 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.10 వేలకు పెంచామని, అర్హులందరికీ ఏటా రూ.110 కోట్లు అందజేస్తున్నామని మంత్రి వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల అధ్యక్షులు కె.ఓబుల్‌రెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములునాయక్, సర్పంచ్‌లు అరుణాబాయి, సుబ్బారెడ్డి, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, పెద్దకాపు జి.వెంకటరెడ్డి, తూమాటి రాంబాబు, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయి కుమార్, తహసీల్దార్ కె.దాస్, ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు, పీఆర్ డీఈఈ బి.సుబ్బారెడ్డి, పంచాయతీ ఈవో ఈదుల రాజశేఖరరెడ్డి, ఈవోఆర్డీ రామసుబ్బారెడ్డి, ఏవో పి.వెంకటేశ్వర్లు, ఏపీవో నాగేశ్వరరావు, ఎంఈవో పి.ఆంజనేయులు, ఏఈలు మహంకాళయ్య, శ్రీకాంత్, అంజిరెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

ఫైలేరియా బాధితులకు కిట్లు పంపిణీ


కిట్లు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఫైలేరియా వ్యాధి (బోదకాలు) నివారణలో భాగంగా జిల్లాలో 1106 మంది వ్యాధిగ్రస్తులకు అవసరమైన మెడికల్ కిట్లు అందచేశారు. ప్రకాశంభవనంలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, మలేరియా నివారణ అధికారి జ్ఞానశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ శింగరాజు మీనా కుమారిలు పాల్గొని కిట్లను బాధితులకు అందచేశారు. ఈ సందర్భంగా ఫైలేరియా వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు వివరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖాధికారులు నాగార్జునరావు, శ్రీనివాసరావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపుల్ జంప్‌లో రెండో స్థానం



ద్వితీయ స్థానం సాధించిన శ్యామలాదేవి

మార్కాపురం: దక్షిణ కొరియాలో జరుగుతున్న ఆసియా పసిఫిక్ మాస్టర్ గేమ్స్‌లో మార్కాపురం బాలికోన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డోలా శ్యామలా దేవి మంగళవారం జరిగిన ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ స్థానాన్ని, 400 మీటర్ల హార్డిల్స్‌లో తృతీయ స్థానాన్ని సాధించినట్లు తెలిపారు. హంగ్‌కాంగ్‌కు చెందిన యువతి ప్రథమ స్థానాన్ని సాధించినట్లు తెలిపారు. ఇప్పటికే శ్యామలా దేవి 80 మీటర్ల హార్డిల్స్‌లో ద్వితీయ స్థానం సాధించింది. ఈ పోటీలు ఈ నెల 22 వరకు జరుగుతాయి. శ్యామలా దేవి దేశం తరపున పాల్గొని పతకాలు సాధించడం పట్ల పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

భూములు పరిశీలించిన జేసీ


భూములను పరిశీలిస్తున్న జేసీ, సబ్ కలెక్టర్

పెద్దదోర్నాల: నేషనల్ హైవే ప్రతిపాదిత వ్యవసాయ భూములను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, సబ్ కలెక్టర్ సేతుమాధవన్‌లు మంగళవారం పరిశీలించారు. నేషనల్ హైవే 765లో భాగంగా పెద్దారవీడు మండలం హనుమాన్ జంక్షన్ నుంచి పెద్దదోర్నాల వరకు వ్యవసాయ భూములు వారు పరిశీలించారు. పెద్దారవీడు మండలం రాజంపల్లి, చట్లమిట్ట, వైడీ.పాడు, సానికవరంతో పాటు పెద్దదోర్నాల మండలం చిన్నగుడిపాడు గ్రామాల్లో ప్రతిపాదనల కోసం భూములను పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ వేణుగోపాలరావు, సిబ్బంది ఉన్నారు.

అట్రాసిటీ కేసులో నిందితుడి అరెస్టు

దర్శి: పట్టణంలోని ఎరుకల కాలనీకి చెందిన పోలా ఏసురాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్శికి చెందిన షేక్ బాజీని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో మంగళవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్సై రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎస్‌సీ కాలనీలో పక్క పక్క నివాసాల్లో ఏసురాణి, బాజీలు ఉంటున్నారు. ఏసురాణితో..నిన్ను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని బాజీ చనువుగా ఉండేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో జనవరి 27వ తేదీన ఉదయం 11 గంటల సమయంలో ఆమె ఇంటి పక్కనే ఉన్న పాత ఇంట్లోకి రావాలని చెప్పాడు. అక్కడికి వెళ్లిన ఏసురాణిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె కుటుంబ సభ్యులు ఏసురాణిని పెళ్లి చేసుకోవాలని కోరగా అందుకు అతడు ఒప్పుకోలేదు. బాధితురాలి దర్శి పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం నిందితుడు ఎస్‌సీ కాలనీలో ఉన్న ఇంటి వద్ద ఉండగా ఎస్సై అక్కడకు వెళ్లగా బాజీ పోలీసులను చూసి పారిపోయాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న ఫిర్యాది కుటుంబసభ్యులు ఎస్సైపై గట్టిగా కేకలు వేస్తూ నిరాధారమైన ఆరోపణలు చేశారు. ఎస్సై ఎంత చెప్తున్నా వినకుండా ఆమె ఇంట్లో శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఫిర్యాది తండ్రి ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. వారికి ఎస్సై నచ్చజెప్పి పోలీస్ వాహనంలో దర్శి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండు టీంలుగా ఏర్పడి దర్శి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దామచర్ల వ్యాఖ్యలపై భగ్గుమన్న బీసీ సంఘాలు

● సాయం చేసిన వ్యక్తుల్ని గుండెల్లో పెట్టుకునేతత్వం బీసీలది
● బీసీలకు అండగా నిలిచింది వాసన్నే
● కుట్రలు పన్నితే రాజకీయ భవిష్యత్ లేకుండా చేస్తాం
● దామచర్ల జనార్దన్‌కు బీసీ సంఘాల నేతల హెచ్చరిక


మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

ఒంగోలు: 'పేదల అభివృద్ధి, సంక్షేమమే ఏ పార్టీకైనా అజెండా కావాలి. అలా కాకుండా కుట్రపూరితంగా బీసీల అభివృద్ధిని అడ్డుకునేందుకు యత్నిస్తే వారికి రాజకీయ భవిష్యత్ లేకుండా చేస్తాం' అని బీసీ సంఘాల నేతలు ముక్తకంఠంతో హెచ్చరించారు. స్థానిక రంగారాయుడు చెరువు పక్కన బీసీల ఆరామ క్షేత్రాల కోసం భూమిపూజ జరిగిన స్థలంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్‌జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు మాట్లాడుతూ బీసీలంటే విశ్వాసానికి మారుపేరు అని, సాయం చేసిన వారిని హృదయాల్లో నిలుపుకునే తత్వం తమదన్నారు. యరజర్ల కొండ మీద పట్టాలను పేదలకు దక్కకుండా అడ్డుకున్నట్లు భూమిపూజ చేసుకున్న ఆరామ క్షేత్రాల స్థలాలకు ఏవరైనా అడ్డుపడాలని యత్నిస్తే సహించేది లేదన్నారు. బీసీలంతా సమష్టిగా మీకు రాజకీయ భవిష్యతే లేకుండా చేసేందుకు ఉద్యమిస్తారని హెచ్చరించారు. బీసీలకు మేలు చేసినట్లు అసత్యాలు వల్లె వేయడం దామచర్ల జనార్దన్ మానుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు కటారి శంకర్ మాట్లాడుతూ ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి బీసీలకు జనార్దన్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 2009లో 9 బీసీ కులాలకు కేటాయించిన స్థలాన్ని నేడు 18 బీసీ కులాలకు సర్దుబాటు చేసి బీసీలందరినీ ఐక్యం చేసిన ఘనత ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికే దక్కిందన్నారు. రెండు మూడు నెలల్లోనే 24 వేల మందికి ఇళ్లపట్టాలు, అదే విధంగా తాగునీటి పైపులైను పనులు ప్రారంభించేందుకు రంగం సిద్ధమైందని, చేతనైతే వచ్చి సంతోషించాలని హితవు పలికారు. రజక సంఘం రాష్ట్ర చైర్మన్ గుర్రం సుబ్బన్న మాట్లాడుతూ ఎప్పటినుంచో రజకులు కుల వృత్తికి ఆసరాగా ఉన్న ఒగ్గులకుంటను 2001లో ఆక్రమించేందుకు టీడీపీ కుట్ర పన్నిందని, దీన్ని తాము కోర్టును ఆశ్రయించి అడ్డుకోగలిగామన్నారు. ఆ రోజుకు కోర్టుకు వెళ్లేందుకు ఆర్థికసాయం లేక ఇబ్బందులు పడుతుంటే బాలినేని సాయం చేశారన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తమకు స్థలం కేటాయించారని, అయితే ఆయన మరణానంతరం పరిస్థితి మొదటికొచ్చిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే దామచర్ల జనార్దన్ కేవలం మాటలు చెప్పి మీటింగ్‌ల పేరుతో కాలయాపన చేశారే తప్ప అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. నాడు మున్సిపల్ కౌన్సిల్ ద్వారా స్థలాన్ని కేటయించింది, నేడు మరలా దాన్ని తమకు అప్పగించి భూమిపూజ కూడా చేసింది బాలినేని శ్రీనివాసరెడ్డేనని, ఆయనకు అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దులూరి శ్రీనివాసులు మాట్లాడుతూ 19 బీసీ కులాల ఆరామ క్షేత్రాల నిర్మాణానికి అయ్యే ఖర్చులో సగం భరిస్తానని ముందుకు వచ్చిన బాలినేనికి బీసీలంతా ఎంతో రుణపడి ఉన్నారన్నారు. వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో దామచర్ల జనార్దన్ బీసీల ఆరామ క్షేత్రాల నిర్మాణాలకు సిమెంట్, ఇసుక, కంకర ఉచితంగా ఇస్తామని ప్రకటించారని, కానీ ఒక్క ఇటుకైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎవరైనా చేసిన పనిని చెప్పుకుంటారు కానీ మాటలను పట్టించుకోరన్నారు. సంచార జాతుల సంఘం అధ్యక్షుడు చెంచయ్య మాట్లాడుతూ సంచార జాతులు పడుతున్న ఇబ్బందులను జనార్దన్ దృష్టికి గత ప్రభుత్వంలో తీసుకువెళ్లినా కనీసం పట్టించుకోలేదన్నారు. నేడు తాము అడగకుండానే తమకు సైతం ఒక ఆరామ క్షేత్రం కట్టుకునేందుకు స్థలాన్ని కేటాయించిన బాలినేని మంచి మనస్సును హృదయపూర్వకంగా అభినందిస్తున్నామన్నారు. సమావేశంలో నూర్‌బాషా సంఘ నాయకులు నాగూర్, ఒంగోలు సూపర్‌బజార్ డైరెక్టర్ వల్లెపు మురళి, మేదర సంఘం జిల్లా అధ్యక్షుడు చలపతి, కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ తిర్లిక శ్రీనివాసులు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ మారెళ్ల శ్రీదేవి శ్రీనివాస్, ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడు జూటూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

● భార్యకు తీవ్ర గాయాలు


సంఘటన స్థలంలో దంపతులు

దర్శి: రోడ్డు ప్రమాదంలో ముండ్లమూరు మండలం పూరిమెట్ల గ్రామానికి చెందిన కాకర్ల కాశీం (55) అనే వ్యక్తి మృతి చెందగా ఆయన భార్య తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. కాశీం, పేరమ్మ దంపతులు మోటారు సైకిల్‌పై కురిచేడు మండలం అలవలపాడుకు దిశదిన కర్మకు వెళ్లి తిరుగు ప్రయాణమై బైకుపై వస్తున్నారు. వెంకటాచలంపల్లి-బోధనంపాడు మధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొని దంపతులు ఇద్దరూ కింద పడిపోయారు. కాశీం అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రయాణికులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సకాలంలో చేరుకున్న 108 సిబ్బంది భర్త మృతి చెందాడని నిర్ధారించి తీవ్రంగా గాయపడిన పేరమ్మను దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక కార్యక్రమాలు

ఒంగోలు అర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి ప్రతి గ్రామపంచాయతీలో పారిశుధ్యం, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ జిల్లా అధికారులకు సూచించారు. పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీలో రోజువారీ కార్యక్రమాలను నిర్దేశించుకుని అమలుచేయాలన్నారు. చేసిన కార్యక్రమాలను ఫొటోలు, వీడియోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వీటిని డీఎల్‌పీఓ, ఈఓఆర్‌డీ, ఎంపీడీఓలు పర్యవేక్షించాలన్నారు.

తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ





వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: వేసవి దృష్ట్యా జిల్లాలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పైపులైన్ అవకాశం లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. పొదిలిలో ఆక్రమంగా వేసిన మోటర్లను గుర్తించి వెంటనే సీజ్ చేయాలన్నారు. నీరు వృథా కాకుండా పైపులైన్ లీకేజీలపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్నారు. ఉష్ణోగ్రతలు, వడగాలులు పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పనుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులు అన్నీ చోట్ల జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. క్షేత్రస్థాయిలో వేతనాలకు సంబంధించి అవకతవకలు జరిగితే ఫీల్డ్ అసిస్టెంట్‌లు సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవన్నారు. అమృత్ సరోవర్ పనులు జరిగిన చోట మండల ప్రత్యేకాధికారులు పరిశీలించి నివేదికలు అందచేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాలైన సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణాల పురోగతి తెలిసేలా ఫొటోలు పంపాలన్నారు. సచివాలయాల్లో సేవలకు సంబంధించి వచ్చిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. జగనన్న తోడు పథకానికి సంబంధించి లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాలన్నారు. సమావేశంలో సీపీఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ పేరయ్య, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి ఉషా రాణి, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, ఇరిగేషన్ ఎస్‌ఈ లక్ష్మారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా నిజాంపట్నంలో మత్స్యకార భరోసా నిధులు విడుదల చేసేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఒంగోలులో జెడ్పీ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సీఎంకు వెంకాయమ్మ విన్నవించారు.
- ఒంగోలు


సీఎంకు పుష్పగుచ్ఛం అందస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు